క్లుప్తంగా

పోలీసుల ఆధ్వర్యంలో మరమ్మతులు



శ్రమదానం చేస్తున్న ఎస్సై

దహెగాం: మండలంలోని కర్జి నుంచి రాంపూర్ మధ్యలోని రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురికావడంతో ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డుకు శ్రమదానం చేశారు. రాంపూర్, మొట్లగూడ, దిగిడ, రావులపల్లి, టీపర్గాం తదితర గ్రామాల ప్రజలు రోడ్డు కోతకు గురై ఇబ్బంది పడుతుండగా ఎస్సై శ్రమదానం చేపట్టి రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు. అధికారులు స్పందించి రోడ్డు కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'సీనియర్ సిటిజన్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర సీనియర్ సిటిజన్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉన్నారని, వారికి ప్రభుత్వం నుంచి సౌకర్యాలు అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటివైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కంటి పరీక్షల్లో 25 మందికి పరీక్షలు నిర్వహించగా 8 మందిని శస్త్రచికిత్సలకు రిఫర్ చేశారు. బెల్లంపల్లి లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ -అనిత తెలిపారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనిథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్నదానం

బెజ్జూర్: మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయ సమీపంలో రైతుల ఆకలి తీర్చడానికి మంగళవారం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు జెడ్పీ మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పర్యవేక్షణలో యూరియా కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న రైతులకు భోజనం వడ్డించారు. మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కోనేరు అభిమానులు పాల్గొన్నారు.

చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో 10 రోజుల పాటు చట్టాలు, హక్కులు, విద్య, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లాస్థాయిలో బేటీ బచావో బేటీ పడావో, బాలల హక్కులు, విద్య వైద్య అంశాలపై అవగాహన కల్పించాలన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న స్థానిక సంస్థల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులతో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి మల్లిఖార్జున్, పార్టీ మండల అధ్యక్షుడు పెంటయ్య, నాయకులు కోట్నాక విజయ్, కోవ విజయ్, వెంకన్న, ప్రహ్లాద్, సొల్లు లక్ష్మి, దీపక్‌రావ్, కృష్ణకుమారీ, ప్రశాంత్, సుజిత్, మరళి, వెంకటేశ్, శరత్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తిర్యాణి: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో వేముల మల్లేశ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ మల్టీపర్పస్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే విధులను బహిష్కరించి పెద్దఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. కార్మికులు తిరుపతి, శంకర్, రాము, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

కౌటాల: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. మోరేశ్వర్, నాగేశ్, ప్రకాశ్, రవి, రాజారం పాల్గొన్నారు.

వారధి కష్టాలు తీరేదెప్పుడో!

- నంబాల వాగుపై లోలెవల్ వంతెనతో తిప్పలు
- వాగు ఉప్పొంగి బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద
- మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన నంబాల బ్రిడ్జి



రెబ్బెన -నంబాల మధ్య లోలెవల్ వంతెన (ఫైల్)

రెబ్బెన: మండల కేంద్రం నుంచి నంబాల, నారాయణపూర్ వెళ్లే మార్గంలో ఉన్న వాగుపై ఉన్న లోలెవల్ వంతెన ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలంలో ఈ వంతెన పైనుంచి వాగు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దాంతో నంబాల, నారాయణపూర్ వైపు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

30 ఏళ్ల క్రితం నిర్మాణం..

రెబ్బెన, నంబాల గ్రామాల మధ్య ఉన్న వాగుపై 30 ఏళ్ల క్రితం లోలెవల్ వంతెన నిర్మించారు. అయితే బ్రిడ్జి వద్ద రానురాను ఎత్తు తగ్గిపోయింది. ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహానికి చెట్లు, కొమ్మలు, చెత్తాచెదారం కొట్టుకొచ్చి బ్రిడ్జి పిల్లర్ల వద్ద చేరి నీటి ప్రవాహానికి అడ్డు పడుతుండటంతో వరద నీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తోంది. వరద ప్రవాహం తగ్గాక అధికారులు చెట్ల కొమ్మలు, చెత్తాచెదారం తొలగిస్తున్నప్పటికీ మళ్లీ వరద వస్తే పరిస్థితి ఎప్పటి లాగే మారుతోంది. గడిచిన వారం రోజుల్లో కురిసిన భారీ వర్షాలకు రెండు సార్లు బ్రిడ్జిపై నుంచి నీళ్లు పారి రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తక్కళ్లపల్లి మీదుగా రాకపోకలు సాగించాల్సి వచ్చింది. నంబాల వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. మండలంలోని నంబాల, ధర్మారం, రాజారాం, నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపెల్లి, కొమురవెల్లి గ్రామ పంచాయతీల ప్రజలు ఈ మార్గం గుండానే మండల కేంద్రానికి రాకపోకలు సాగించాల్సి ఉంది. దానితో పాటు భీమినీ మండలంతో పాటు తాండూర్ మండలం రేచినీ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆయా గ్రామాల ప్రజలు ఈ మార్గం గుండానే ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న మార్గంలో లోలెవల్ బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సోమశేఖర్

రెబ్బెన: రెబ్బెన -నంబాల గ్రామాల మధ్య ఉన్న నంబాల బ్రిడ్జి వద్ద భారీ వర్షాలకు పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని నంబాల మాజీ సర్పంచ్ చెన్న సోమశేఖర్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ సూర్యప్రకాశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు గుండ మహేశ్, ఉప్పులేటి మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మించాలి



నంబాల వాగుపై ప్రస్తుతం ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలి. బ్రిడ్జి ఎత్తు తక్కువగా ఉండటంతో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ వాగు నీళ్లు బ్రిడ్జిపై నుంచి పారుతున్నాయి. ఆ సమయంలో రెబ్బెనకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. - గోపాల్, నంబాల

వర్షాకాలంలో ఇబ్బంది



రెబ్బెన నుంచి నంబాల వెళ్లే మార్గంలో ఉన్న వాగుపై లోలెవల్ బ్రిడ్జి ఉండటంతో వర్షాకాలంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరదనీటితో చెట్లు, కొమ్మలు కొట్టుకొచ్చి బ్రిడ్జి వద్ద ఆగుతున్నాయి. దాంతో వరద ప్రవాహానికి అడ్డు ఏర్పడి వరద నీరు బ్రిడ్జిపై నుంచి పారుతోంది. - రాజాగౌడ్, ఆటో డ్రైవర్, రెబ్బెన

30 ఏళ్ల క్రితం..



నంబాల వాగుపై దాదాపు 30 ఏళ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. ప్రస్తుతం పెరిగిన జనాభా, మారిన పరిస్థితులకు గతంలో నిర్మించిన బ్రిడ్జి ఉపయోగపడటం లేదు. పాత లో లెవల్ బ్రిడ్జి స్థానంలో కొత్త హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి. - చెన్న సోమశేఖర్, మాజీ సర్పంచ్, నంబాల

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు



ప్రతిష్ఠించిన లక్ష్మీదేవి



లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి మండల కేంద్రంతో పాటు మండలంలోని కెలికే, కెలిబి, సాంగ్వి, మోడి తదితర గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు లక్ష్మీపూజలు నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగిన లక్ష్మీదేవి పూజలు మంగళవారం ముగిశాయి. ఏళ్లుగా వస్తున్న ఆచారాన్ని మహిళలు కొనసాగిస్తూ మంగళహారతులతో పూజలు చేశారు. ఏటా పొలాల అమావాస్య పర్వదినం అనంతరం ఈ పూజలు జరుపుకుంటారు. – కెరమెరి

ప్రత్యేక డిజిటల్ తరగతులపై శిక్షణ



శిక్షణ తీసుకుంటున్న సైన్స్ ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్

వాంకిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక డిజిటల్ సైన్స్ తరగతులపై ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు సైన్స్ సబ్జెక్టుల్లో మెలుకువలు నేర్చుకుంటారన్నారు. డిజిటల్ తరగతుల ద్వారా బోధన ఉంటుందని, ప్రతీరోజు ఒక గంట పాటు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో శివచరణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, ఖాన్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాడమీ షెడ్యూల్ అనుసరించాలి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వం ఆదేశానుసారం విద్యార్థులకు ఖాన్ అకాడమీ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేయాలని ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీఎస్ ఎస్ పెట్రోల్ పంప్ పాఠశాలలో భౌతిక, గణిత శాస్త్ర ఉపాధ్యాయులకు ఖాన్ అకాడమీ ఓరి యంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అకాడమీ రూపొందించిన షెడ్యూ ల్ ప్రకారం విద్యాబోధన నిర్వహించాలని సూచించారు. మాచెర్ల రాజేశం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు తుది జాబితా విడుదల



తుదిజాబితా విడుదల చేస్తున్న కోట ప్రసాద్

కాగజ్‌నగర్‌రూరల్: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాగజ్‌నగర్ ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఫొటో ఓటరు తుది జాబితాను మంగళవారం ఎంపీడీవో కోట ప్రసాద్ విడుదల చేశారు. ఓటరు తుది జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాల వివరాలను విడుదల చేశారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు గ్రామ పంచాయతీల్లో జాబితాను పొందుపర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

కౌటాల: మండల ఓటరు లిస్ట్ తుది జాబితాను మంగవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా సవరించి విడుదల చేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 182 వార్డుల పరిధిలో 27,357 ఓట్లు ఉన్నాయని, అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తుది జాబితా ప్రదర్శించినట్లు తెలిపారు. ఏపీవో పూర్ణిమా, దీపక్, కార్యదర్శులు సాయికృష్ణ, భాస్కర్, అశోక్, ప్రదీప్, ఆపరేటర్లు సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు



రెబ్బెన: నంబాల గంగపుత్ర గణేశ్ మండలి వద్ద కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

రెబ్బెన: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. మంగళవారం మండలంలోని నంబాలలో గంగపుత్ర గణేశ్ మండలి ఆధ్వర్యంలో భక్తులు కుంకుమార్చన పూజలు చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లో పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మహిళలు కుంకుమార్చన పూజలు చేసి భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. రాత్రివేళ మండపాల్లో భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

లింగాపూర్: మండలంలోని పిక్లాతండా గ్రామానికి చెందిన బానోత్ కృష్ణ తయారు చేసిన మట్టి విగ్రహానికి మంగళవారం గ్రామస్తులు నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా డప్పుచప్పుళ్లతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గణేశ్ నవరాత్రులు కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో 7వ రోజులో భాగంగా పట్టణంలోని సరస్వతి శిశుమందిర్, గాంధీచౌక్ గణేశ్ మండలితో పాటు పైకాజీనగర్‌లో అన్నదానాలు నిర్వహించారు. పైకాజీనగర్‌లోని శ్రీ విద్య శివ పార్వతి గణేశ్ మండలి వద్ద సీఐ బాలాజీ వరప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిశు మందిర్‌లో గంధం వేణు, మురళి సోదరులు, పాపిని వెంకన్న మహాప్రసాద వితరణ చేశారు. శిశు మందిర్ హెచ్ఎం కోటేశ్వర్ రావు, ప్రతినిధులు చిలువేరు వెంకన్న, బోగ మధూకర్, ఖాండ్రే విశాల్, సాయిని సంతోష్, పత్తి శ్యాం, పోలీసు పీఆర్వో కార్తీక్, ఆయా గణేశ్ మండళ్ల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: పైకాజీనగర్‌లో అన్నదానంలో వడ్డిస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



పంగిడిమాదరలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తిర్యాణి: మండలంలో జ్వరాలు విజృంభిస్తున్నా అధికారులు ఫాగింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదని ఈనెల 1న 'సాక్షి'లో 'మంచం పట్టిన తిర్యాణి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం మండలంలోని పంగిడిమాదర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా గ్రామాల్లో దోమల వ్యాప్తి నివారణ కోసం ఫాగింగ్ (దోమల నివారణ మందు పిచికారీ) చేపట్టడంతో పాటు మురుగు నీళ్లు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కెరమెరి: వారంలోగా మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి కావాలని ఎంఈవో ఆడే ప్రకాశ్, మండల ప్రత్యేకాధికారి వెంకట్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంలు చంద్రశేఖర్, భాస్కర్ ఉన్నారు.

రాత పుస్తకాలు అప్‌డేట్ చేయాలి

కెరమెరి: తరగతిలో ఉన్న విద్యార్థులు రాతపుస్తకాలు అప్‌డేట్ చేసేలా చూడాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంనగర్, పార్ద పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు రావాలన్నారు. హెచ్ఎంలు అరుణ్, సుభంత్‌రావు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

సిర్పూర్(టి): బీఆర్ఎస్ పార్టీ నేత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని ప్రధాన రహదారిలో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ అస్లాంబిన్ అబ్దుల్లా మాట్లాడుతూ పీసీ ఘోష్ కమీషన్ నివేదికను, సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అసెంబ్లీలో అబద్ధపు మాటలకు, వ్యతిరేకంగా రాస్తారోకో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ అస్లాంబిన్ అబ్దుల్లా, బీఆర్ఎస్ పార్టీ నాయకులు షేక్ చాంద్, లక్ష్మణ్, హీరామన్, దేవిదాస్, దీపక్, అహ్మద్, రవి, సునీల్, గౌతమ్, భీంరావ్, సోపి, ముత్తపటేల్, సంతోష్, నాగేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు సరికాదు

పెంచికల్‌పేట్: కాళేశ్వరం ప్రాజెక్టుపైన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విమర్శలు సరికావని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో సాగు నీటిని అందించడానికి గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసిందన్నారు. పీసీ ఘోష్ కమిషన్ పేరుతో బీఆర్ఎస్ నాయకులను వేధించడం మానుకోవాలన్నారు.

జైనూర్: కేసీఆర్‌పై కాంగ్రెస్ పార్టీ కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా అన్నారు. మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్, సర్పంచుల మాజీ సంఘం మండల అధ్యక్షుడు మడావి భీంరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

భారీ వర్షం.. ఉప్పొంగిన వాగులు



దహెగాం: అలుగు పోస్తున్న పెద్ద చెరువు

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, ఒర్రెలు ఉప్పొంగాయి. మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువు, చింతపాటి చెరువుల్లోకి వరద రావడంతో మత్తడిపై నుంచి అలుగు పోసింది. దీంతో వరద నీరు వరి పొలాల్లోకి చేరింది. మల్లన్న ఒర్రె ఉధృతంగా ప్రవహించింది. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో పెద్దవాగు, ఎర్రవాగు పరీవాహక ప్రాంతాల్లోని రైతులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని సూచిస్తున్నారు. వరికి, పత్తికి వర్షాలు అనుకూలంగానే ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.

బస్సుల్లేక జనం బేజారు



బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

కెరమెరి: బస్సులు సమయానికి అందుబాటులో లేక జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్ రూట్‌లో వెళ్లే ఒక్కబస్సు కూడా లేక పోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. 6 గంటలకు ఒక బస్సు రాగా ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు ఎగబడ్డారు. పరిమితికి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతో బస్సు ప్రయాణికులతో కిక్కిరిసింది. కాగా విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సి వచ్చింది.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం



సన్మానిస్తున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: జీఎం సివిల్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస్‌రావును మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎంతో పాటు ఇతర విభాగాల అధిపతులు సన్మానించారు. జీఎం విజయ భాస్కర్ రెడ్డి పదవీ విరమణ పొందిన ఆయనను సన్మానించి మొక్క బహూకరించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో శ్రీనివాస్‌రావు వివిధ హోదాల్లో పని చేసి సంస్థకు అనేక సేవలు అందించారన్నారు. ఖైరగూడ ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఎస్వోటూజీఎం కే.రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనా బాషా, ఏరియా సెక్యూరిటీ అధికారి శ్రీధర్ అన్ని విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శుభ్రత అలవాట్లు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఉదయ్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల్లో శుభ్రత అలవాట్లు పెంపొందించాలని పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో పరిశుభ్రత, పచ్చదనం, నీటి సంరక్షణ, వ్యర్థ పదార్థాల నిర్వహణ వంటి అంశాల ప్రాధాన్యత విద్యార్థులకు తెలియజేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి మధుకర్, తిరుపతయ్య, శాంతికుమార్ పాల్గొన్నారు.